క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం



బాల్కొండ: బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తూ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోం గార్డు జలంధర్ కుటుంబానికి బాల్కొండ పోలీసుల తరఫున రూ.50 వేలు అందజేశారు. గురువారం నగదును ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



డొంకేశ్వర్(ఆర్మూర్): తొండాకూర్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన స్వామి ఆరేళ్లుగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా 58 మంది విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం లింగారెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు ప్రవీణ్ గౌడ్, సవీణ్, పాఠశాల హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బాల్కొండ: ముప్కాల్‌లోని పోలింగ్ కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పరిశీలించారు. కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగు పరచాలని సూచించారు. తహసీల్దార్ వనజరాణి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ ఉన్నారు.

నిమజ్జన బావికి కంచె ఏర్పాటు చేయాలి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలోగల వినాయకుల నిమజ్జన బావి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మిసాలె నగేష్ కోరారు. ఈ మేరకు టీజీవీపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణకు వినతి పత్రం అందజేశారు. సమీప పాఠశాల విద్యార్థులు దాని చుట్టూ చేరి ఆడుకుంటున్నారని, కంచె లేనందున ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తగా కంచె ఏర్పాటు చేయాలని కోరారు. షేక్ మాజిద్, విగ్నేష్‌లు ఉన్నారు.

అవకతవకలు బయటపడతాయనే..

మాక్లూర్: వ్యవసాయ పరపతి సంఘంలో జరిగిన నిధుల దుర్వినియోగ విషయం బయటపడుతుందనే అప్పట్లో సంఘ అధ్యక్షురాలు ఉద్దేశపూర్వకంగా కుమారుడితో సంఘం మినిట్స్‌లో దొంగచాటున తనను సస్పెండ్ చేసినట్టు సృష్టించి హెచ్‌ఆర్ పాలసీ నుంచి తొలగించారని మాక్లూర్ విండో మాజీ కార్యదర్శి విష్ణువర్ధన్ ఆరోపించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరుతో మాట్లాడారు. అప్పటి డీసీవో సింహాచలం కూడా సంఘం అధ్యక్షురాలికి అన్ని విధాలుగా సహకరించారన్నారు. తాను హెచ్‌ఆర్ పాలసీలోనికి వస్తే సంఘంలో జరిగిన అవకతవకలన్ని బయటపడుతాయన్న ఉద్దేశంతోనే అలా చేశారన్నారు. ప్రస్తుత డీసీవో విచారణ జరపాలని కోరారు.

బెల్టు దుకాణాలను నియంత్రిస్తాం

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయం పరిధిలోని గ్రామాలతో పాటు పట్టణంలో బెల్టు దుకాణాలను నియంత్రిస్తామని సీఐ పవన్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. మద్యం దుకాణదారులు సమయ పాలన పాటించాలని, మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాబాల్లో మద్యం సిట్టింగులు ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తామని సూచించారు.

ఎన్నిక

వర్ని: బోధన్ డివిజన్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా వర్ని మండలం జాకోర గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సతీష్ కుమార్(రెంజల్), కోశాధికారిగా రాధిక(రుద్రూర్), సహాయ కార్యదర్శిగా సుధాకర్(బోధన్)లను ఎన్నికయ్యారు.

అడుగడుగునా లీకేజీలే..

- పోచంపాడ్‌లో నీటి సరఫరా పరిస్థితి
- కలుషితమవుతున్న నీరు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ప్రాజెక్ట్ వద్ద పైపులైన్ లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ కాలనీకి ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి నీటిని సరఫరా చేసే పైపు లైన్లు లీకేజీలమయంగా మారాయి. దీంతో నీరు వృథాగా పోవడమే కాకుండా కలుషితమవుతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలనీకి నీటిసరఫరా చేయటానికి కాలనీ ఏర్పాటు చేసిన సమయంలో పైపులైన్లు వేశారు. ఆ పైపులు సిమెంట్ పైపులు కావడంతో అక్కడక్కడా పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో వాటర్ ట్యాంకు వరకు నీరు వెళ్లేలోపు సగం నీరు రోడ్లపైనే పోతోంది. అయినా ఇప్పటి వరకు పాలకులు పట్టించుకోలేదు. ప్రాజెక్ట్ కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా ఉన్నప్పటికి ఇతర అవసరాల కోసం ఈ నీరు వాడుతుంటారు. ప్రాజెక్ట్ వాటర్ సప్లయి విభాగం ద్వారా నీటి సరఫరా చేపడుతారు. రానున్న వేసవిలో పల్లెల్లో తాగు నీటి సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా ఉంది. ఇలా అడుగుకు ఒక లీకేజీ ఉంటే నీటి సరఫరా ఎలా జరుగుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ట్యాంక్ నుంచి కాలనీకి నీటి సరఫరా చేసేపైపు లైన్ కూడా అధ్వానంగా ఉంది. గతంలో ప్రాజెక్ట్ అధికారులు నీటి నిర్వహణ బాధ్యతలు చేపట్టే వారు. కానీ ప్రస్తుతం పోచంపాడ్ కాలనీ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. దీంతో జీపీ అధికారులే దాని బాధ్యతలు తీసుకున్నారు. కాని క్షేత్రస్థాయిలో అది కనిపించడం లేదు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దోమలు పెరుగుతున్నాయి..

పైపు లైన్ లీకేజీ కారణంగా ఆ నీరు రోడ్డు పక్కన, కాలనీలో కుంటలలో నిలుస్తున్నాయి. దీంతో దోమలు ఎక్కువగా పెరిగి కాలనీ వాసులు రోగాల బారిన పడటానికి దోహదపడుతున్నాయి. అంతే కాకుండా కంపు కొడుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు లేకుంటే ప్రత్యామ్నాయంగా నూతన లైన్ వేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు సంతోషకరం



సాలూరాలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న వీరశైవ లింగాయత్‌లు



పాలాభిషేకం చేస్తున్న పెరిక సంఘం నేతలు

బోధన్: వీరశైవ లింగాయత్ లింగ బలిజ ఫైనాన్షియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందని ఆ సమాజ్ బోధన్, సాలూర మండల ప్రతినిధులు అన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక పరంగా అభివృద్ధిలో వెనుకబడిన తమకు కార్పొరేషన్ ద్వారా ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సాలూర మండల కేంద్రంలోని మహాత్మా బసవేశ్వరుడి విగ్రహం ఎదుట సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

పెరిక కార్పొరేషన్ ఏర్పాటుపై..

బోధన్: పురగిరి క్షత్రియ(పెరిక) సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం ప్రకటించడం పట్ల ఆ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సాలూర మండల కేంద్రంలో బోధన్ ఉమ్మడి మండలానికి చెందిన సంఘ ప్రతినిధులు సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలభిషేకం చేశారు. పెరిక సంఘం ప్రతినిధులు ఇల్తెపు రమేష్, కొట్టల్ గంగయ్య, అల్లె జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుపై..

బోధన్‌టౌన్(బోధన్): వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న మున్నూరు కాపులకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీసీబీ డెలిగేట్ గంగా శంకర్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సీఎం, సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సొసైటీ చైర్మన్ ఉద్మార్ లక్ష్మణ్, మున్నూరు కాపు కులస్తులు పాల్గొన్నారు.



బోధన్ పట్టణంలో.. మున్నూరుకాపులు

సరోజనమ్మకు రాష్ట్ర స్థాయి ఉమెన్స్ అచీవర్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న గుర్రాల సరోజనమ్మ

బోధన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో పలు రంగాల్లో ఉత్తమ సేవలందించిన మహిళలకు ఉమెన్స్ అచీవర్స్–2024 అవార్డులు ప్రదానం చేశారు. బోధన్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ, మంత్రి ధనసరి సీతక్క చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. శా లువా, జ్ఞాపికతో సత్కరించి రూ.లక్ష చెక్కును అందించారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలకు..

బోధన్: బోధన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ప్రాజెక్టు గ్రేడ్ –1 సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రమీలా రాణికి రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారం దక్కింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్ర భారతిలో ప్రమీలా రాణికి 'ఇన్‌వెస్ట్ ఇన్ ఉమెన్ ఆక్సిలిరేట్ ప్రొగ్రెస్' పురస్కారాన్ని ఉన్నతాధికారులు అందించారు. శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

అక్బర్‌నగర్‌లో మహిళా దినోత్సవం

రుద్రూర్: అక్బర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మాజీ ఉపసర్పంచ్ వేములపల్లి సీతమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ తాజా మాజీ సర్పంచ్ గంగామణి, ప్రకృతి ఆశ్రమం అభివృద్ధి కమిటీ సలహాదారురాలు సాయి లీల, లావణ్యతో పాటు స్థానిక మహిళా సిబ్బందిని సన్మానించారు. మాజీ సర్పంచ్ దూడ భీమప్పా, హెడ్మాస్టర్ రవికుమారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మహిళా రైతుకు..

ఎడపల్లి (బోధన్): సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన పుష్పకు మంత్రి సీతక్క చేతుల మీదుగా ఉత్తమ మహిళా రైతు అవార్డు అందించి సన్మానించారు. శాలువాతో సత్కరించి రూ. లక్ష నగదు ప్రోత్సాహం అందించారు.

గిడ్డంగి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గిడ్డంగి నిర్మాణానికి రూ.10 లక్షలు రాజ్యసభ ఎంపీ సంతోష్ కుమార్ ఎంపీల్యాడ్స్ నిధుల నుంచి మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని సొసైటీ చైర్మన్ దేవేందర్‌కు గురువారం వేల్పూర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి సొసైటీ పాలకవర్గం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ఎంపీటీసీ సుధాకర్, సొసైటీ డైరెక్టర్లు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ఇందులో భాగంగానే ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అన్నారు. గురువారం బల్దియా కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 5 గ్యారంటీ పథకాలను ఇప్పటికే అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ప్రజల అభీష్టానికి అనుగుణంగా పనిచేస్తుందని చెప్పారు. కమిషనర్ వెంకట నారాయణ, తహసీల్దార్ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలపై డీలర్లకు శిక్షణ



డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయంలో పంటల సాగుపై రెండో బ్యాచ్ ఇన్పుట్ డీలర్లకు గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మ పీడీ తిరుమల ప్రసాద్ హాజరై మాట్లాడారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ (దేశీ) శిక్షణ డీలర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సాగులో మెలకువలు, నూతన పద్ధతులు తెలుసుకుని రైతులకు సాంకేతిక సలహాలు, సూచనలు చేయాలని డీలర్లకు సూచించారు. శిక్షణ పొందిన వారికి త్వరలో సర్టిఫికెట్లు కూడా అందజేస్తామన్నారు. ఆత్మ డీపీడీ దైవ గ్లోరి, అమరేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలో జాతీయ రహదారికి సంబంధిచిన స్థలంలో ఏర్పాటు చేసుకున్న ప్రికాస్ట్ వాల్‌ను గురువారం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తొలగించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన వ్యాపారి ఒకరు స్థలాన్ని ఆక్రమించుకుని ప్రికాస్ట్‌తో హద్దులు ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ప్రికాస్ట్‌ను తొలగించారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పవన్, రవి శంకర్, విరాజ్ దేశ్ పాండే, వీరబాబు, రెవెన్యూ సర్వేయర్ షికారి రాజు, ఆర్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వాయిదా పడిన వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నవీపేట: మండల కేంద్రంలో నిర్వహించే మేకలు, కూరగాయల సంతలు, సులభ్ కాంప్లెక్స్‌లకు గురువారం నిర్వహించిన వేలం పాటలు మళ్లీ వాయిదా పడ్డాయి. రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించిన 50 మంది ఔత్సాహికులు మేకల సంత వేలంలో పాల్గొన్నారు. రూ.40, 35,000ల వద్ద వేలం ఆగిపోయింది. గతేడాది ఈ సంతకు రూ.55 లక్షల వేలం వచ్చింది. అలాగే వారాంతపు కూరగాయల సంత వేలంలో 24 మంది పాల్గొనగా రూ.4,61,000ల వద్ద ఆగిపోయింది. ఈ సంతకు గతేడాది రూ.15 లక్షల ఆదాయం వచ్చింది. అలాగే సులభ్ కాంప్లెక్స్ నిర్వహణకు రూ.1,42,000ల వేలం వచ్చింది. ఆశించిన స్థాయిలో వేలం ధర రాలేదని ఈ మూడింటిని మళ్లీ 19న నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఎంపీవో రామకృష్ణ, కార్యదర్శి రవీంధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటికి బీఆర్‌ఎస్ శ్రేణులు చేరుకుని ఆయనతో కేక్ కట్ చేయించారు. పలు చోట్ల పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కార్యకర్తలు కొనియాడారు.

– వేల్పూర్/బాల్కొండ/కమ్మర్‌పల్లి



బాల్కొండ మండల కేంద్రంలో ..



వేల్పూర్‌లో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్ కేజీబీవీలో బాలికలకు పండ్లు అందజేస్తూ..

ఆధ్యాత్మికం

■ భక్తి మార్గమే ముక్తి మార్గం



బోధన్‌టౌన్/బోధన్‌రూరల్: దేవుడిపై ఉన్న భక్తి మార్గం ద్వారానే మనిషికి ముక్తి లభిస్తుందని మల్లారం గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహారాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని బస్వతారక్ నగర్ కాలనీలోని కోట మైసమ్మ సహిత లక్ష్మి నరసింహస్వామి ఆలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా పిట్ల కృష్ణ మహారాజ్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి మహారాజ్ మాట్లాడారు. హిందూ ధర్మాచారాలే మానవ మనుగడకు మూలమని పేర్కొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పసులోటి గోపికిషన్, భక్తులు పాల్గొన్నారు.

■ సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠాపన



కమ్మర్‌పల్లి: బషీరాబాద్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. దాతలు గోపు నారాయణ లావణ్య దంపతులు వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య దేవతామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, ఎంపీటీసీ తోట జ్యోతి, హెచ్‌ఎంలు శంకర్‌గౌడ్, గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు ఆకుల భాజన్న, తదితరులు పాల్గొన్నారు.

■ హన్మాన్ మండల దీక్షలు ప్రారంభం

కమ్మర్‌పల్లి: ఆంజనేయస్వామి మండల దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కమ్మర్‌పల్లి, ఉప్లూర్, హాసాకొత్తూర్, బషీరాబాద్, చౌట్‌పల్లి, కోనసముందర్ తదితర గ్రామాల్లో హన్మాన్ భక్తులు మండల దీక్ష (41 రోజులు) తీసుకున్నారు. కమ్మర్‌పల్లిలో జంబి హన్మాన్ దేవాలయంలో కమ్మర్‌పల్లి, నాగాపూర్ గ్రామాలకు చెందిన 65 మంది దీక్షాపరులకు పురోహితులు రమేష్‌చంద్రశాస్త్రి మాలధారణ చేశారు.

■ చక్రేశ్వర శివాలయంలో హుండీ లెక్కింపు



బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని చక్రేశ్వర శివాలయంలో ధర్మదాయ దేవాదాయ శాఖ, ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాదాయ ధర్మ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల, ఈవో రవీందర్ గుప్తా, ఆలయ చైర్మన్ కర్నె హనుమంతరావు, ఆలయ ప్రధాన అర్చకులు గణేష్ మహరాజ్, ఆలయ కమిటీ డైరెక్టర్లు, పోలీసు సిబ్బంది, పట్టణ ప్రముఖుల ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కర్నె హనుమంత్ రావు మాట్లాడుతూ భక్తుల కానుకల ద్వారా హుండీలో రూ.3,67,045లు, ఆర్జిత సేవలు, అభిషేకాల ద్వారా రూ.4,33,348లు కలిపి మొత్తం రూ.8,300,933లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

■ ఉత్సవ కమిటీ చైర్మన్‌కు సన్మానం



బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని చక్రేశ్వర శివాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ కర్నె హనుమంత్ రావును వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని చక్రేశ్వర శివాలయంలో నిర్వహించిన బ్రహోత్సవాలు, శివరాత్రి వేడుకలను విజయవంతంగా నిర్వహించినందుకు శాలువ పూలమాలతో సన్మానించి అభినందించారు.

సమాచారం..

■ నేడు వేల్పూర్ మండల సర్వసభ్య సమావేశం

వేల్పూర్: వేల్పూర్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ భీమ జమున అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బాలకిషన్ గురువారం తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు ఉదయం 11 గంటలకు సమావేశానికి హాజరు కావాలని చెప్పారు.

■ మోస్రా తైబజార్ వేలం

వర్ని(మోస్రా): మోస్రా గ్రామపంచాయతీ తైబజార్ వేలం శుక్రవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ ఆవరణలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి ప్రేమ్ కుమార్ వెల్లడించారు. 2024 –25 ఆర్థిక సంవత్సరానికి వేలం నిర్వహిస్తున్నామని, వేలంలో పాల్గొనదలచిన వారు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

■ 19న బాల్కొండలో..

బాల్కొండ: మండల కేంద్రంలో జీపీ ఆధ్వర్యంలో ఈ నెల 19న తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. వీక్లీ మార్కెట్, రోజువారీ సంత, దాఖాల చిట్టీ కోసం వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50 వేల డిపాజిట్ చేయాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



మాక్లూర్: మదన్‌పల్లి వడ్డెర కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం స్థానిక ఎంపీటీసీ గోవూరు భూమి పూజ చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.4 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం ఎక్కడ నిర్మించాలనేది గ్రామస్తులతో చర్చించి అందరి అభిప్రాయం మేరకు ఒడ్డెర కాలనీలో పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యదర్శి మహేష్, మాజీ ఎంపీటీసీ స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	బులెట్ (తెలుగు) - 10.25
	సైతాన్ (హిందీ) - 1.15, 7.00
	బాబు (తెలుగు) - 4.15
	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 10.00
స్క్రీన్-2 –	గామి (తెలుగు) - 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-3 –	భీమా (తెలుగు) - 12.30, 3.35, 6.40, 9.45

ముగిసిన ఇంటర్ పరీక్షలు



లగేజీతో ఇంటికి బయలుదేరుతున్న విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. హాస్టల్‌లో ఉంటూ చదువుకున్న విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఇంటికి బయలుదేరారు. తోటి మిత్రులతో కలిసి బస్టాండ్‌కు దారిపట్టారు.

సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం



రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలిలో మార్క్‌ఫెడ్, విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని గురువారం విండో చైర్మన్ శాంతీశ్వర్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటను దళారులకు విక్రయించి నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలకు తెచ్చి లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు, విండో సీఈవో భరత్, డైరెక్టర్లు శ్రీనివాసరావు, భగవంత్ రావ్, విఠల్, ఏఈవో శంకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.